క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం



అవార్డు గ్రహీతను సన్మానిస్తున్న దృశ్యం

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు జెడ్పీ హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయురాలు హన్నా సీమోన్ ఇటీవల జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డు అందుకున్నట్లు హెచ్ఎం ప్రాణేష్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక పాఠశాలలో ఆమెను పాఠశాల ఉపాధ్యాయ బృందం, బోధనేతర సిబ్బంది సన్మానించారు.

దేశ సంస్కృతిని కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న అనిస్‌పాషా

పాణ్యం : దేశ సంస్కృతిని కాపాడే బాధ్యత అందరిపై ఉందని అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు అనిషపాష అన్నారు. బుధవారం సుగాలిమెట్ట వద్ద ఉన్న ఏపీ మోడల్‌స్కూల్, కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించారు. అనంతరం పాఠశాలల మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దినేష్ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేద్దాం



సురక్ష క్యాంపుల ప్రణాళికను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన ప్రణాళికలను పరిశీలించారు. క్యాంపులకు అవసరమైన ఆరోగ్య పరీక్షల కిట్లను, మందులను సిద్ధం చేసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

దేశాభివృద్ధిలో సాంకేతిక విద్యదే కీలక పాత్ర



శాట్విన్ జనరల్ మేనేజర్ ఉదయకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న కళాశాల బృందం

కల్లూరు: దేశాభివృద్ధిలో సాంకేతిక విద్యదే కీలక పాత్ర అని శాట్విన్ జనరల్ మేనేజర్ (రిక్రూట్మెంట్) ఎస్.ఉదయకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం దూపాడు సమీపంలోని అశోకా మహిళ ఇంజినీరింగ్ కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఉదయకాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే కష్టపడితే కానీ విజయం సాధించలేమన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.నవీన్, అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముగిసిన క్రీడాపోటీలు

గడివేముల: మండలస్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు ముగిసినట్లు ఎంఈఓ -2 విమలా వసుంధరదేవి తెలిపారు. బుధవారం మండల స్థాయి బాలికల పోటీలను ప్రారంభించారు. వివిధ విభాగాల్లో 180 దాకా విద్యార్థులు పాల్గొన్నారు. ఎంపికైన విద్యార్థులు నియోజకవర్గస్థాయిలో ఆడాల్సి ఉంటుందన్నారు. పీడీ భుజంగరావు, ఆయా పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

సి.బెళగల్: మండల పరిధిలోని పీహెచ్‌సీలలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారిని, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల హెచ్చరించారు. బుధవారం డీడీ పోలకల్ పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. వైద్యులపై ఫిర్యాదులు ఉన్నాయని, పద్ధతులు మార్చుకోవాలని సూచించారు. పోలకల్ - 1 , ముడుమాల సచివాలయాన్ని తనిఖీ చేశారు. అలాగే మోడల్ స్కూల్‌ను సందర్శించారు.

'సుంకేసుల'కు ఇన్‌ఫ్లో

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి రిజర్వాయర్‌కు బుధవారం 375 క్యూసెక్కుల వరద నీటి ఇన్ ఫ్లో ఉంది. కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాం పూర్తి స్థాయి నీటి నిల్వ స్థామర్థ్యం 1.20 టీఎంసీలు కాగా ప్రస్తుతం పూర్తి స్థాయి నీటి స్థామర్థ్యం ఉన్నట్లు అధికారులు వివరించారు. దిగువకు నీటి విడుదల నిలిపివేశారు.

ప్రజారోగ్యానికి రక్ష

- మండలంలో ఈ నెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే
- ఇంటింటికీ ఏఎన్ఎంలు, వలంటీర్లు
- 30వ తేదీ నుంచి వైద్య శిబిరాలు

గడివేముల: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్న విషయం తెలిసిందే. వైద్య వ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావడంలో దేశం మొత్తం రాష్ట్రం వైపు చూసేలా జగనన్న ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలు చేస్తోంది. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష అనే మరో కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గ్రామాలు, పట్టణాల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి జబ్బులున్న వారిని గుర్తించి, మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం దీనిని అమలు చేయనుంది.

15 నుంచి ఇంటింటికీ వలంటీర్లు..

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ నుంచి గ్రామ, వార్డు వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తారు. ఆరోగ్యశ్రీ కరపత్రాన్ని పంపిణీ చేసి సేవలను వివరిస్తారు. 16వ తేదీ నుంచి నిర్వహించే సర్వేలో భాగంగా ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు గృహాలను సందర్శించి ప్రజలకు ప్రాథమిక వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలను గుర్తిస్తారు. ఇంటింటి సర్వే సమయంలో సాధారణ, దీర్ఘకాలిక వ్యాధులు, గర్భిణులు, బాలింతలు, తగిన బరువు లేని పిల్లలు, క్షయ, కుష్టు, సంక్రమించని, సంక్రమించే వ్యాధులు, గిరిజన ప్రాంతాల్లో సికిల్ సెల్, మలేరియా, డెంగీ తదితరాలతో బాధపడుతున్న వారిపై దృష్టి సారిస్తారు. సర్వే సమయంలో ఫొటో తీసి ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేస్తారు. నిర్వహించిన పరీక్ష ఫలితాలను డాక్టర్లకు అందుబాటులో ఉంచుతారు. ఆరోగ్య సమస్యలున్న వారు వైద్య శిబిరాలకు హాజరయ్యేందుకు వీలుగా ఏఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు టోకెన్ ఇస్తారు. ఇందుకోసం ప్రత్యేకంగా యాప్‌ను రూపొందిస్తున్నారు. జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక అధికారులను నియమించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిరంతరం పర్యవేక్షణ చేయనున్నారు.

మండలాల్లో మెగా వైద్య శిబిరాలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు డాక్టర్లు ఉంటారు. వీరితో పాటు 104లో ఉండే డాక్టరు అందుబాటులో ఉంటారు. మండలంలో ఎన్ని విలేజ్ హెల్త్ క్లినిక్ ఉన్నాయో ఆ పరిధిలో గుర్తించిన రోగులందరికీ ఆ రోజు వైద్య శిబిరంలో చికిత్సలు అందించే విధంగా చర్యలు చేపట్టనున్నారు. శిబిరాల నిర్వహణలో ఎంపీడీఓ, తహసీల్దార్లు మొదలు అన్ని శాఖల అధికారులు పాలుపంచుకోవాల్సి ఉంటుంది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రెండు అంశాలు కీలకం కానున్నాయి. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు జబ్బులను గుర్తించడం ఒక అంశమైతే.. వారికి చికిత్స చేయించేందుకు రిఫరల్ కోసం ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం రెండో అంశం.

దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి..

మధుమేహం, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు, కిడ్నీ సమస్యలు వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులపై ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించనున్నారు. ఇందుకోసం ఆరోగ్య సిబ్బందికి ఇప్పటికే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



గడివేముల పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ,డాక్టర్



దుర్వేశి గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించేడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ నెల 15 నుంచి ఇంటింటికీ వలంటీరు, ఏఎన్ఎంలు వెళ్లి సర్వేను నిర్వహించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఈ నెల 30న వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లో మండలస్థాయిలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

–డాక్టర్ మొల్లా జబీన్,
వైద్యాధికారిణి, గడివేముల

ఆర్థిక సాయం

ఓర్వకల్లు : మండల విద్యా వనరుల(ఎంఆర్‌సీ) కేంద్రంలో క్లస్టర్ రీసోర్స్ పర్సన్ (సీఆర్‌పీ)గా పని చేస్తున్న జంగం మల్లికార్జునయ్య కొద్ది రోజులుగా అస్వస్థతకు గురై, కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు ఎంఈఓ ఓంకార్‌యాదవ్ తెలిపారు. విషయం తెలుసుకున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, రాష్ట్ర కౌన్సిలర్ సురేష్‌బాబు, మహిళా ఉపాధ్యాయులు విజయలక్ష్మి, మహేశ్వరి బుధవారం ఆసుపత్రికి వెళ్లి మల్లికార్జునయ్యను పరామర్శించారు. అలాగే రూ.30 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

గూడూరు రూరల్: సుంకేసుల రిజర్వాయర్‌లోకి దూకి ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అక్కడే ఉన్న యువకులు నీటి నుంచి బయటకు తీసుకునివచ్చి ప్రాణాలను కాపాడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కర్నూలు నగరంలోని ముజఫర్ నగర్‌కు చెందిన ఈరమ్మ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో డ్యామ్‌లోకి దూకింది. అక్కడే ఉన్న యువకులు నరేంద్ర, నాగేంద్ర, షరీఫ్, రేపల్లె రాజు, మధు, ఏసు గమనించి నీటిలో కొట్టుమిట్టాడుతున్న ఈరమ్మను ఒడ్డుకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం రాజోలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు పాల్పడిన మహిళను ప్రాణాలతో కాపాడిన యువకులను చుట్టు పక్కల వారు అభినందించారు.

నగర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం



స్టాంటన్‌పురంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే

- 38, 39, 40 వార్డులలో రూ.1.69 కోట్లతో అభివృద్ధి పనులు
- శంకుస్థాపన చేసిన మేయర్, ఎంపీ, ఎమ్మెల్యే

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య, కర్నూలు ఎంపీ డాక్టర్ సింగరి సంజీవ్‌కుమార్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం సాయంత్రం కర్నూలు నగర పాలక సంస్థ సాధారణ నిధులు రూ.1.69 కోట్లతో 38వ వార్డులో రూ.49.34లక్షలతో పార్కు, సామూహిక మరుగుదొడ్లు, 39వ వార్డులో రూ.45లక్షలు, 40వ వార్డులో రూ.75 లక్షలతో రోడ్లు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి ప్రత్యేక పూజలు చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేలుస్తూ, పూలబొకేలు, పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ కర్నూలు నగర పాలక సంస్థ పరిధిలోని వార్డులను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కర్నూలు నగరాన్ని స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చేయడంతో పాటు వార్డులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు రవిశాస్త్రి, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, సాంబ, సచివాలయ కన్వీనర్లు ముజమ్మిల్, కరీముల్లా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ఉంటాం

- రబీ సాగుపై దృష్టి సారించాలి
- నెలాఖరులోగా సబ్సిడీ శనగ విత్తనాలు పంపిణీకి చర్యలు
- రైతులతో ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు ముఖాముఖి



రైతులనుద్దేశించి మాట్లాడుతున్న ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్‌బాబు

కోడుమూరు రూరల్ : అన్నదాతలకు ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని, అన్నివిధాలుగా ఆదుకుంటామని ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబు తెలిపారు. వర్షాభావ పరిస్థితుల మూలంగా ఖరీఫ్ సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గిందని, అధైర్యపడకుండా రబీ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. కోడుమూరులోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబు, జిల్లా వ్యవసాయాధికారిణి వరలక్ష్మి రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వివిధ గ్రామాల రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి తదితర పంటలు చేతికి రాలేదని, వాటిని తొలగించి శనగ పంటను సాగు చేసేందుకు సిద్ధమవుతున్నామన్నారు. ఈ ఏడాది ఎకరాకు 25కిలోల శనగ విత్తనాలు కాకుండా 40కిలోల చొప్పున ఐదెకరాలకు ఇవ్వాలని రైతులు కోరారు. అదేవిధంగా ధర రైతులకు అందుబాటులో ఉండేలా చూడాలని రైతులు కోరగా ఏపీ సీడ్స్ ఎండీ శేఖర్‌బాబు సానుకూలంగా స్పందించారు. రైతులకు అనుగుణంగా శనగ విత్తనాలు అందజేసేందుకు తమవంతు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

కల్లూరు : ఏపీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ శేఖర్ బాబు కల్లూరు మండలం ఎ.గోకులపాడులో బుధవారం పత్తి పంటను పరిశీలించారు. శనగ విత్తన పంపిణీ సమీక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన ఎ.గోకులపాడులోని రైతులతో మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పత్తి పంట సాగు విస్తీర్ణం తగ్గినందున రైతులు శనగ పంటను సాగు చేసుకోవాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలి

పాణ్యం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేయాలని కోరుతూ ఎంఆర్‌సీఎస్ నాయకులు బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరహార దీక్ష చేపట్టారు. రాష్ట్ర నాయకుడు గద్దల సామేల్ ఆధ్వర్యంలో అధికారులకు వినతి పత్రం అందించారు.

విద్యార్థులకు కంటి వైద్య శిబిరం

ఓర్వకల్లు : మండలంలోని పూడిచెర్ల జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కంటి వైద్యులు డాక్టర్ సత్యనారాయణ విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి అద్దాలు పంపిణీ చేస్తారని హెచ్ఎం విజయలక్ష్మి తెలిపారు.

సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- మద్దూరు, అవుపూరు, అహల్యాపురం గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మద్దూరులో లబ్ధిదారురాలికి సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: సచివాలయ వ్యవస్థతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించి గాంధీ కలలను సాకారం చేశారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మద్దూరు, అవుపూరు, అహల్యాపురం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వారికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో ప్రజలకు అందించాల్సిన సంక్షేమాన్ని విస్మరించి పాలకులు ప్రచారానికి ప్రాధాన్యతనిచ్చారన్నారు. టీడీపీ నాయకులు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజాధనాన్ని దొచారన్నారు.

కుందూ విస్తరణకు శ్రీకారం..

కుందూనది పరివాహక గ్రామాలపై ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. కుందూనదికి వరదప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం కుందూనది విస్తర్ణకు శ్రీకారం చుట్టిందన్నారు. వరద ప్రభావం గ్రామాలపై పడకుండా శాశ్వత పరిష్కారం చూపుతున్నామన్నారు.

రైతులకు ఇబ్బంది రానివ్వం

అహల్యాపురం గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యేకు రైతులు భూపనపాడు రస్తాలో ఉన్న కొర్రవాగుపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. దిగుబడుల సమయంలో ఇబ్బందులు పడుతున్నామని చెప్పగా... తక్షణమే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత రైతులకు ఇబ్బంది లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, సర్పంచ్‌లు ప్రదీప్‌రెడ్డి, కంపమల్ల నాగలక్ష్మమ్మ, మండల సచివాలయాల కన్వీనర్ గుద్దేటి సుమంత్‌రెడ్డి, వీరయ్యస్వామి, నారాయణస్వామి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, సురేష్, శ్రీనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఓర్వకల్లులో జిల్లా స్థాయి 'స్పందన'

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో గురువారం ఉదయం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివనాగ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ సృజన, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. స్థానిక జీవేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని హుసేనాపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

గడివేముల: ప్రతి రైతు సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏఓ హేమసుందర్‌రెడ్డి అన్నారు.బుధవారం మండల పరిధిలోని బొల్లవరం గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. అనంతరం రైతులుకు పలు సూచనలిచ్చారు. ఈ నెల 30వ తేది వరకు పంట నమోదు కార్యక్రమాన్ని పొడిగించినట్లు చెప్పారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల పంపిణీ

ఓర్వకల్లు : ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన పంట ఉత్పత్తులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన ఓర్వకల్లు రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తులను రైతులకు పంపిణీ చేశారు. ఒక్కో కిట్టులో 9 రకాల ధాన్యపు విత్తనాలను అందజేసినట్లు వెల్లడించారు. రైతులు ప్రకృతి వ్యవపద్ధతులను మరింత బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

గడివేముల: మండల కేంద్రమైన గడివేములలోని సచివాలయం -1లో రెండో విడతలో కొత్తగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి బుధవారం పంపిణీ చేశారు. అదేవిధంగా గడిగరేవుల, తిరుపాడు సర్పంచ్‌లు రామ్మోహన్ రెడ్డి, బాలలింగమ్మలు, వెల్ఫేర్ అసిస్టెంట్ విజయుడుల ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన పింఛన్ల సొమ్మును లబ్ధిదారులను అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, ఈఓఆర్‌డీ ఖాలీక్, ఉప సర్పంచ్ బాలచెన్ని పాల్గొన్నారు.

పాణ్యం: మండలంలోని కొండజుటూరు సచివాలయంలో కొత్త పింఛన్‌దారులకు మంజురైన పింఛన్ సొమ్మును జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ , సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి పంపిణీ చేశారు. మండలంలో 6033 పాత పింఛన్లు ఉండగా మొదటి విడుతలో 175, రెండో విడుతలో 134 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. పాణ్యం సచివాలయంలో సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రోశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్త పింఛన్‌లు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన

కోడుమూరు రూరల్ : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం కోడుమూరు ఎంపీడీఓ కార్యాలయంలో రెండవ విడత కింద మంజూరైన కొత్త పింఛన్లను ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా ఎంపీడీఓ చంద్రశేఖర్ పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ మధ్య దళారీ వ్యవస్థ లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి గ్రామ సచివాలయాలు, వలంటరీ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మాధవి, ఈఓ అజయ్ భాస్కర్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, స్థానిక వైసీపీ నేతలు పాల్గొన్నారు.



గడివేములలో బిడుదూరి శివమ్మకు పింఛన్ అందిస్తున్న జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి



కొండజుటూరులో కొత్త పింఛన్‌లు అందిస్తున్న జెడ్పీటీసీ సద్దల సరళమ్మ



లబ్ధిదారుడికి పింఛన్‌ను అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

జగనన్నతోనే అన్ని వర్గాల సంక్షేమం

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- జి సింగవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం జి సింగవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిరెడ్డి, ఆదాం పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా తెలుగు బాపిస్టు చర్చిలో ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కులమతాలకు అతీతంగా పథకాలు..

ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికే మార్గదర్శకమయ్యారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్న జగనన్నకు అండగా ఉండి మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీలు ప్రసన్నకుమార్, గిరిజోన్, సచివాలయాల మండల కన్వీనర్ సత్యంరెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మండల మాజీ ఉపాధ్యక్షుడు వాసు, ఎంపీడీఓ అజాంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి భరోసా

నిరుపేద ప్రజలందరి సంక్షేమం, అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా భరోసా కల్పిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. బుధవారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల పరిధిలో నూతనంగా 524 వైఎస్సార్ పింఛన్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మొదటి విడతలో 265, రెండవ విడతలో 524 పింఛన్లు మంజూరయ్యాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు ప్రసాద్, సంపత్‌కుమార్, గోపాల్, గొందిపర్ల సర్పంచ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో నిలిచిన కర్మిషా

కల్లూరు : జిల్లా స్టేడియంలో జరుగుతున్న అథ్లెటిక్ పోటీలలో మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (మైనార్టీ) విద్యార్థినులు రాణిస్తున్నారని కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి తెలిపారు. బుధవారం జరిగిన అథ్లెటిక్ పోటీలో ఇంటర్ విద్యార్థిని సాయి ప్రియ అండర్ -18 గ్రూప్‌లో 200 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం సాధించిందన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థిని సాలీషా అండర్- 18 గ్రూప్‌లో 100 మీరట్ల పరుగు పందెంలో రెండవ స్థానం, పదో తరగతి విద్యార్థిని సోఫీయా అండర్ 16- గ్రూప్ 400 మీటర్ల పరుగు పెందెంలో మూడవ స్థానం, కరిష్మా అండర్ 14 గ్రూప్ తొమ్మిదవ తరగతి లాంగ్ జంప్, 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, రిజ్వాన అండర్ -16 గ్రూప్ ఎనిమిదోవ తరగతి 100 మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానంలో నిలిచారని చెప్పారు. నలుగురు విద్యార్థినులు రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

సి.బెళగల్: మండల అధికారులు, సచివాలయాల ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ అధికారి (డీఎల్‌డీఓ) బాలకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని గ్రామాలలో పర్యటించి గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. కొత్తకోట సచివాయంలో రికార్డులు, సంక్షేమ పథకాల అబ్దిదారులు, పథకాల రికార్డులను తనిఖీ చేశారు. అదేవిధంగా ఆయా గ్రామ సచివాలయాలల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. మండలంలో ఈనెల 15 నుంచి నిర్వహించాల్సిన జగనన్న ఆరోగ్య రక్ష కార్యక్రమ ఏర్పాట్లపై సూచనలు చేశారు.

ప్రభుత్వ అనుమతులున్న వాటినే విక్రయించాలి

సి.బెళగల్: ఫెస్టిసైడ్స్, ఫర్టిలైజర్ దుకాణాల యజమానులు ప్రభుత్వ అనుమతులున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను మాత్రమే అమ్మాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన ఎరువులు, పురుగు మందులు, విత్తన దుకాణ యజమానులతో బుధవారం ఏఓ సమావేశం నిర్వహించి మాట్లాడారు. స్టాక్, అమ్మకాల రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఏఈఓ సిద్ధు, ఎంపీఈఓ వెంకటేశ్వర్లు, డీలర్లు పాల్గొన్నారు.